నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 05 ఆగస్టు 2025 - పేజీలు 8











# మా ఇష్టం...

## మేం చెప్పింది చేయాల్సిందంతే..!

పల్నాడు, గుంటూరు జిల్లాల విద్యాశాఖ వారి కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వారి కార్యాలయాల్లో పనిచేసే సూపరింటెండెంట్ నుండి దిగువ ఉద్యోగుల వరకు ఈ వేధింపులతో మానసిక క్షోభకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అటెండర్ నుంచి ఉద్యోగి వరకు రాత్రి తొమ్మిది గంటల వరకు అని చేపిస్తూ ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. రోజు సాయంత్రం ఐదు గంటలకి ఆఫీసు నుండి ఉద్యోగులు వెళ్లిపోవచ్చని ప్రభుత్వం చెబుతూ ఉంటే ఈ ఇద్దరు డిఈవోలు కార్యాలయాలను ఉద్యోగులను వేధింపులకు గురిచేసి పై చాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.....

.. 3లో

**దందాలకు పాల్పడుతున్న గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖ అధికారుల "సిత్రం.**

- మానసిక క్షోభకు గురవుతున్న డీఈఓ కార్యాలయాల సిబ్బంది
- ఈ డి ఈ వోలు మాకు వద్దు బాబోయ్..
- ప్రతి రాత్రి 9 గంటల వరకు ఆఫీస్ పనులు చేయాల్సిందే
- ఇద్దరు డి ఈ వోలు ప్రభుత్వ కార్యాలయాలను లంచాల కేంద్రంగా మార్చారు.
- వాపోతున్న ఉద్యోగులు
- ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్న గుంటూరు పల్నాడు డీఈవోలు

## పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు వెంటనే ఇవ్వాలి

### బాలింతలకు కలెక్టర్ పిలుపు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆగస్టు 1 నుండి 7 వ తేది వరకు నిర్వహించే ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, కిమ్స్ శిఖర ఆసుపత్రి రూపొందించిన ప్రచార పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తో కలసి ఆవిష్కరించారు. పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లి ముర్రు పాలు త్రాగించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఈ సందర్భంగా సూచించారు. తదుపరి తల్లులకు కిట్స్ అందజేశారు. డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, డిఆర్ఓ ఖాజావలి, ఆర్.డి.ఓ. శ్రీనివాసరావు డిఏంఅండ్ హెచ్ఓ., డా.విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.శ్రావణ్ బాబు, కిమ్స్ శిఖర ఆసుపత్రి యూనిట్ హెడ్ డా. ఎన్.వి. హరి కుమార్ , డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా.క్రిష్ణ ప్రభ , నియోనాటాలజిస్ట్ డా.సాహతి, గైనకాలజిస్ట్ డా.ఎన్.అనిత పాల్గొన్నారు.

## పల్నాడులో పెరిగిన

# ఆర్థిక నేరాలు

- స్మార్ట్ మోసాలతో నష్టపోతున్న సామాన్యులు
- తాజాగా రూ.70 కోట్లతో వ్యాపారి పరారీ



**పల్నాడు జిల్లా ప్రతినిధి, నేటి దినపత్రిక సూర్య:** పల్నాడు జిల్లా ఆర్థిక నేరాలకు కేంద్రంగా మారుతోంది. చిట్‌ఫండ్ కుంభకోణాలు, దొంగ బంగారం మోసాలు, నెట్‌వర్క్ బిజినెస్ దోపిడీలు, యానిమేషన్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రామిస్‌ల పేరుతో కోట్ల రూపాయలు ఎగగొట్టే సంఘటనలు ఇక్కడ సర్వసాధారణంగా

మిగతా 3లో..

## వైన్ షాప్ ఏర్పాటును నిలిపివేయించండి



**తెనాలి, మేజర్ న్యూస్ :** ప్రశాంత వాతావరణం ఉన్న ఇళ్ల మధ్యలో వైన్ షాప్ ఏర్పాటును నిలిపివేయాలని కొత్తపేట ప్రాంతవాసులు తహశీల్దార్ కె వి గోపాలకృష్ణను కోరారు. పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ప్రశాంతంగా జీవిస్తున్నామని తెలిపారు. సరోజినీ నాయుడు వీధి వాసుదేవన్ వీధి మలుపు వద్ద ఓ వైన్ షాప్ షాప్ ఏర్పాటుకు జరుగుతున్న పనులు నిలిపివేయాలన్నారు. వైన్స్ వల్ల ప్రశాంతతకు బంధం కలగడంతో పాటు మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటుచేయనున్న వైన్స్ నిలిపివేయాలని తహశీల్దారును వారు కోరారు.

## నరసరావుపేటలో సుపరిపాలన తొలి అడుగు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని 27, 28, 29 వార్డులలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు ఇంటింటికీ తిరిగి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే, ఈ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, ప్రభుత్వ పథకాలపై సానుకూల స్పందన వ్యక్తం చేశారు.

# బిడ్డకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యకరం : సబ్ కలెక్టర్ సంజనా సింహ



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఇరుగుల అన్నపూర్ణ, స్త్రీ ,సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి పి. విజయా గౌరి తదితరులు పాల్గొని తల్లి పాల ఆవశ్యత గోడ ప్రతులను ప్రదర్శించి, తల్లి పాల ఆవశ్యతను వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ తల్లి పాల ఆవశ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదని, తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాల వలన వ్యాధినిరోశక్తి పెరుగుతుందని, తల్లి పాలు తాగిన బిడ్డలకు మేధస్సు అధికంగా ఉంటుందని అన్నారు. తల్లిపాలు త్రాగే పిల్లలు వ్యాధుల బారిన పడకుండా తట్టుకునే శక్తిని కలిగి ఉంటారని అన్నారు. స్త్రీ , శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి పి విజయా గౌరీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లి బిడ్డ మధ్య అనుబంధం పెరుగుతుందని, అంతేకాకుండా బిడ్డకు పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,అంగనవాడి సూపర్వైజర్లు కే సౌజన్య ,వై నాగమణి తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గర్భవతులకు బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను అంగన్వాడీ సూపర్వైజర్ ,వై యామిని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

### ఫిర్యాదుల పరిష్కారంలో

# అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి : నగర మేయర్ రవీంద్ర

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ వంటి వేదికలకు స్థానికంగా పరిష్కారం కాని తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వస్తుంటారని, సదరు ఆర్జీలను ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులకు తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ ను అదనపు కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 20 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని అదనపు కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో సూపరిండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు.




పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 31 ఫిర్యాదులు అందాయని, పట్టణ ప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ విభాగం 5, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 6, అకౌంట్స్ విభాగానికి సంబందించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన ఆర్జీలను విభాగాల వారిగా విబజించి, సంబంధిత విభాగాదిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఈ. కోటేశ్వర రావు, ఎంహెచ్ఓ(ఇంచార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# జాతీయకిరీటం పెట్టిన తెలుగు సినిమాకు సెల్యూట్ : దిలీప్ రాజా

- బాలీవుడ్ కు ధీటుగా టాలీవుడ్
- జాతీయ పురస్కార గ్రహీతలకు'మా-ఎపి' అభినందనల తీర్మానం ఆమోదం

**తెనాలి, మేజర్ న్యూస్ :** నూతన సాంకేతిక ప్రమాణాలే తెలుగు సినిమాకు జాతీయ కిరీటం తెచ్చి పెట్టిందని 'మా-ఏపీ' వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. స్థానిక 'మా-ఎపి ' కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ భారత చలనచిత్ర 71 వ జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాకు ఏడు పురస్కారాలు రావడమంటే బాలీవుడ్‌కు ధీటుగా టాలీవుడ్ నిలిచిందన్నారు. జాతీయ పురస్కారాలకు ఎంపికయిన ఏడుగురికి అభినందనలు తెలియచేసే తీర్మానాన్ని' నేటి సమావేశంలో ' మా ఏపి' ఆమోదించినట్లుగా ఆయన తెలిపారు. రొటీన్ హీరో పాత్రలకు భిన్నంగా బాలక్రిష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలవడం జ్యూరి నూతన పంధాకు నిదర్శనమన్నారు. యానిమేషన్,విజువల్ ఎఫెక్ట్ లకు అగ్రతాంబూలం పెట్టిన 'హను-మాన్' చిత్రానికి గాను నందు, పృథ్వి లకు,ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్ గా 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నటించిన ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ,'బలగం' చిత్రంలో ఊరు పల్లెటూరు గీత రచయిత కాసర్ల శ్యామ్ కు ఉత్తమ పాటల రచయితగా,ఉత్తమ గాయకుడిగా రోహిత్, 'బేబీ' చిత్రానికీ ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా దర్శకుడు నీలం సాయి రాజేష్ లకు



'మా-ఏపి' లిఖితపూర్వక అభినందనలు పంపిస్తున్నట్లుగా దిలీప్ రాజా వివరించారు. సమావేశంలో నటులు వేమూరు విజయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలుగోడి సత్తాను చూపుగల దర్శకులున్నారన్నారు, సమావేశంలో నటులు మిలటరీప్రసాద్, ఆరాధ్యుల కన్నా,అయ్యప్ప,గంగారపు సుబ్బారావు,బసవ రత్న ,వుయ్యూరు విశ్వనాథ్, కారుమూరు శివరామిరెడ్డి, వాకా ఆదినారాయణ, తన్నీరు రమణ,చినరాయుడు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆధునిక ఫోన్లు అందించాలి : అంగన్వాడీలు

**తెనాలి, మేజర్ న్యూస్ :**

యాప్ లకు సంబంధించి పనిచేయడానికి ఇబ్బందిగా ఉందని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తమకిచ్చిన సెల్ ఫోన్ లను సీడీపీవో పి విజయా గౌరి కి అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ యూనియన్ ఇచ్చినపిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో యాప్ లకు సంబంధించి పని సరిగా జరగడం లేదని అన్నారు. 2 జి ఫోన్లలో యాప్ లు సరిగా పనిచేయడం లేదన్నారు. ప్రభుత్వం 5 జి ట్యాబ్ లేదా ఫోన్ అందించాలని కోరారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయా గౌరి మాట్లాడుతూ అంగన్వాడీలు యాప్ లకు సంబంధించిన పని చేయడానికి ఫోన్లు సహకరించడం లేదని తిరిగి ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం మెరుగైన ఫోన్లు అందించి తమ పనిభారం తగ్గించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



### విద్యా వికాసమే

# మా ప్రభుత్వ లక్ష్యం: కన్నా

- రూ. 3. 87 కోట్లతో కేజీబీవీ అదనపు భవనాల శంకుస్థాపన



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :**

బాలబాలికల విద్యా వికాసమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం సత్తెనపల్లి, రాజుపాలెం కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో రూ. 3. 87 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ శంకుస్థాపన చేశారు. సమగ్రశిక్షా, పాఠశాల విద్యాశాఖ మంజూరు చేసిన 1 కోటి 59 లక్షల 50 వేల నిధులతో కస్తూరిబా గాంధీ పాఠశాల రాజుపాలెంలో బాలికల అదనపు వసతిగృహం, 1కోటి 67 లక్షల 54 వేలతో సత్తెనపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాల బాలికల అదనపు వసతిగృహం, సత్తెనపల్లి కేజీబీవీలో కంప్యూటర్ రూమ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, లైబ్రరీల కోసం 60 లక్షల 10 వేల నిధులతో చేపట్టిన పనులను శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ నిధులు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారం, సౌకర్యాలు వాడుకుని బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మా ఇష్టం... మేం ఏం చెబితే అది చేయాల్సిందే..!

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు, పల్నాడు జిల్లాలో విద్యాశాఖ అధికారులుగా నిత్యం తమ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని తీవ్రంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఈ రెండు జిల్లాలకు బదిలీలపై వచ్చిన వి రేణుక ఎల్. చంద్రకళ ఇద్దరూ వారి కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రతినిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. దీంతో సూపరిండెంట్ స్థాయి నుంచి కింద స్థాయి వరకు ఉన్న ఉద్యోగస్తులు మానసికంగా చిత్రహింసలు అనుభవిస్తున్నారని ఉపాధ్యాయ వర్గాల భోగట్ట. ముఖ్యంగా గుంటూరు విద్యాశాఖ అధికారిగా అయితే అటెండర్, ఆఫీసులో పని చేసే ఉద్యోగస్తులను ప్రతిరోజు రాత్రి తొమ్మిది గంటలు కానిదే ఇంటికి పంపించటం లేదని ఆరోపణలు వస్తున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ , సూపరిండెంట్ గుంటూరు విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కి వెళ్తే ఎన్ని గంటలైనా నిలబడి పనులు చేయించుకోవాల్సిందే. అంటే అసలా ఫైల్స్ సంతకాలు కోసం వెళ్తే ఆమె ముందు కూర్చునే అవకాశం లేదు... ప్రతి ఫైల్ కు ఒక రేటు పెట్టి లంచాలు గుంజుతున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. లంచాల కోసమే రాత్రి పది గంటల వరకు కార్యాలయంలోనే జిల్లా విద్యాశాఖ అధికారి విధులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. . వేరే కార్యాలయాల నుండి దిగువ స్థాయి ఉద్యోగస్తులను డిప్యూటేషన్ పై వేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇందుకోసం డబ్బులు గుంజుతున్నారని. పల్నాడు, గుంటూరు జిల్లా డీఈవో కార్యాలయాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆమె మాట వినకపోతే ఏదో విధంగా సదరు ఉద్యోగస్తుల పై తప్పులు చూపి వేరే ప్రాంతానికి పంపుతున్నట్లు చెబుతున్నారు. దీనివల్ల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతూ ఇబ్బంది పడుతున్నారు.

**ఇక పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి పనితీరు కూడా ఇలానే ఉందని చెబుతున్నారు. వీరిద్దరి పనితీరు గురించి**

ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు తెలుస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు ఉద్యోగుల యూనియన్ వర్గాలు కూడా ఈ ఇద్దరి వ్యవహారంపై గుసగుసలాడుకుంటున్నాయి. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి మాట వినకపోయినా ఆమెకి వ్యతిరేకంగా మాట్లాడిన ఎంత స్థాయి ఉద్యోగస్తునైనా సరే వెంటనే వేరే ప్రాంతానికి బదిలీ కావాల్సిందే. అంతేకాక జీతభత్యాలు కూడా రాకుండా అడ్డుకుంటూ సిబ్బందిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

గతంలో ఇక్కడ సూపరిండెంట్గా విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి ట్రాన్స్ఫర్స్ బ్యాన్ లో ఉన్న సమయంలో ఆర్జెడి దగ్గర ప్రత్యేకంగా కూర్చొని మాట్లాడి అతనిని అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద జీతం పడని విధంగా బదిలీ చేయించారని ఆరోపణలు వస్తున్నాయి.

ఇక్కడ డీఈవో పనితీరుపై కార్యాలయ ఉద్యోగస్తులు గగ్గోలు పెడుతున్నారు. డి ఈ ఓ కు అనుకూలంగా ఉన్న కొంతమంది కిందిస్థాయి ఉద్యోగస్తులను ఉమ్మడి జిల్లా అధికారి సంతకం లేకుండానే డిప్యూటేషన్ పై పల్నాడు డీఈవో కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు నియమించుకున్నట్లు తెలిసింది. . ఇద్దరు అధికారులు ముఖ్యంగా సిబ్బంది పట్ల వ్యవస్థను తీరు ఆక్షేపనీయంగా కూడా ఉందని దళిత ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు..ఉదాహరణకు జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి అన్ని టెస్టులు పాసై సీనియర్ అసిస్టెంట్గా పదోన్నతి పొందవలసి ఉన్నా ప్రమోషన్ ఇవ్వకుండా ఆపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి

అతని కన్నా జూనియర్స్ లేదా అతని తరువాత పదవ తరగతి పాస్ అయిన ఇద్దరు ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇచ్చి నట్లు తెలిసింది. తదుపరి ఈ ఏడాది జరిగిన ట్రాన్స్ఫర్స్ లో ఒక ఉద్యోగిని వేధింపులకు గురి చేస్తూ సుమారు మూడు నెలల నుంచి పోస్టింగ్ ఇవ్వకుండా జీతభత్యాలు చెల్లించకుండా కనీసం మానవతా దృక్పథంతో సహాయం చేయకుండా వేధింపులకు గురి చేసినట్టు తెలుస్తోంది.

ఆ ఉద్యోగిని ప్రతిరోజు కార్యాలయాలు చుట్టూ తిప్పు కుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి

ఉన్నతాధికారుల పేరు చెప్పి ఈ ఇద్దరు డి ఈ వోలు కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెబుతున్నారు

పల్నాడు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆడిటర్ పాఠశాలలను తనిఖీ చేయవలసిన ఒక ఉద్యోగిని ఆడిటర్ పనులు చేయకుండా అక్రమంగా సూపరిండెంట్ హోదా కలిపిస్తూ సదర కార్యాలయంలో ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ సూపర్నెంట్గా నియమించి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా కార్యాలయం విధులు నిర్వహిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అవినీతి కార్యక్రమంలో ఆర్థికంగా పెద్ద మొత్తంలో లబ్ది పొందుతున్నారని కార్యాలయంలోని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఇక డైట్ లో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి ఒక ఉద్యోగిని స్టడీ లీవ్ లో ఉన్నటువంటి సదరు ఉద్యోగిని. మందలించి తెలుస్తోంది.

ముఖ్యంగా కాన్ఫిడెన్షియల్ గా ఉండవలసిన పదవ తరగతిలో పరీక్షల విభాగానికి అన్ని తానై ఉద్యోగం చేస్తున్నాడని కార్యాలయాలు సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. స్టడీ లీవ్ లో ఉన్న ఉద్యోగి పల్నాడు డీఈవో కార్యాలయంలో విధులు నిర్వహించటం ఏంటని అనేకమార్లు టీచర్ యూనియన్ దృష్టికి తీసుకువెళ్లినా తీసుకువెళ్లను అతనిపై ఎటువంటి చర్యలు లేవు. అతనిని కాపాడుతూ అతని ద్వారా లంచాలో రూపంలో డబ్బులు వసూలు చేస్తూ లబ్ది పొందుతున్నారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. గతంలో పల్నాడు. డి ఈ ఓ సంతకం ఫోర్జరీ చేసిన ఒక ఉద్యోగిపై ఏ విధమైన శాఖపరమైన చర్యలు అలాంటి వ్యక్తిని వేరే చోటికిబదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. గుంటూరు , పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాలపై ఉన్నతాధికారుడు దృష్టి పెట్టి విచారణ జరిపితే వీర అవినీతి , లంచగొండి తోటి ఉద్యోగస్తులను వేధింపులకు గురి చేస్తున్న అనే విషయాలు వెల్లడవుతాయని ఆయా కార్యాలయాల సిబ్బంది , యూనియన్ నాయకులు చెబుతున్నారు.

## పల్నాడులో పెరిగిన ఆర్థిక నేరాలు

మొదటిపేజీ తరువాయి

మారాయి. ఈ నేరాల బాధితుల్లో సామాన్య కార్మికుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు ఉన్నారు. అయితే ఈ మోసాలను అరికట్టడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**చిట్‌ఫండ్ కుంభకోణాలు..** జిల్లాలో చిట్‌ఫండ్ కంపెనీల ద్వారా జరిగిన మోసాలు బాధితుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. సాయి సాధన చిట్‌ఫండ్ కంపెనీ కేసు ఇందుకు ప్రధాన ఉదాహరణ. 2023-24 కాలంలో ఈ కంపెనీ నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో వేల మంది నుంచి సుమారు 200 కోట్ల రూపాయలను సేకరించినట్లు అంచనా ఉంది. అధిక వడ్డీ రాబడి వాగ్దానాలతో ఆకర్షించిన ఈ కంపెనీ, ఇన్వెస్టర్ల డబ్బును ఎగగొట్టింది. ఈ కేసు యాంటీ-కరప్షన్ బ్యూరో (ఏసీబీ) కోర్టులో ఉన్నప్పటికీ, బాధితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదు. గత రెండేళ్లలో జిల్లాలో చిట్‌ఫండ్ మోసాల ద్వారా 500 కోట్ల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**యానిమేషన్ స్కామ్..** జిల్లాలో యానిమేషన్ కుంభకోణం మరో ఆందోళనకర అంశం. నరసరావుపేటలోని ఓ యానిమేషన్ కంపెనీ, అధిక లాభాల వాగ్దానంతో సుమారు 150 కోట్ల రూపాయల పెట్టుబడులను సేకరించింది. ఈ స్కామ్‌లో సామాన్యులతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు కూడా నష్టపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారని, పోలీసులు ఇప్పటివరకు కేవలం 10శాతం మొత్తాన్ని మాత్రమే రికవరీ చేయగలిగారని తెలుస్తోంది. ఈ స్కామ్ కారణంగా నరసరావుపేటకు చెందిన ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాను కలవరపరిచింది.

**దొంగ బంగారం కేసులు..** పల్నాడు జిల్లాలో దొంగ బంగారం కేసులు అనేకం నమోదవుతున్నాయి. నరసరావుపేట, పిడుగురాళ్లలో దొంగలు నకిలీ బంగారాన్ని తక్కువ ధరకు విక్రయిస్తామని చెప్పి, వ్యాపారులను మోసం చేస్తున్నారు. పిడుగురాళ్లలో ఓ గోల్మాల్ వ్యాపారి ఈ విధంగా 50 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసినట్లు గుర్తించారు. 2024-25లో జిల్లాలో దాదాపు 30కి పైగా దొంగ బంగారం కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు తెలియజేస్తున్నాయి. బాధితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, నిందితులు పరారీలో ఉండటంతో పురోగతి కనిపించడం లేదు.

**ద్విచక్ర వాహనాల షోరూం మోసం..** తాజాగా నరసరావుపేటకు చెందిన ఓ ద్విచక్ర వాహనాల షోరూం వ్యాపారి రూ.70 కోట్లకు పైగా ఎగగొట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యాపారి ఇన్వెస్ట్‌మెంట్ ప్రామిస్‌ల పేరుతో వ్యాపారులు, సామాన్యుల నుంచి డబ్బు సేకరించి, ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. అదే విధంగా సెల్‌ఫోన్ షాపుల వ్యాపారులు కూడా ఇలాంటి మోసాలకు పాల్పడిన సంఘటనలు నరసరావుపేటలో వెలుగుచూశాయి. ఈ కేసులో బాధితుల సంఖ్య 500కు పైగా ఉంటుందని, నష్టం 100 కోట్ల రూపాయలకు మించినట్లు అంచనా ఉంది.

**నెట్‌వర్క్ బిజినెస్ దోపిడీ..** పల్నాడు జిల్లాలో నెట్‌వర్క్ బిజినెస్ పేరుతో జరుగుతున్న దోపిడీ మరో ప్రధాన సమస్యగా మారింది. ఆన్‌లైన్ మల్టీ-లెవెల్ మార్కెటింగ్ (ఎం ఎల్ ఎం) స్కీమ్‌లు, అధిక రాబడి వాగ్దానాలతో రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నాయి. గత మూడేళ్లలో జిల్లాలో 10,000 మందికి పైగా ఈ స్కీమ్‌లలో పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు అంచనా ఉంది. కొందరు ఆర్థిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2024లో నరసరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో ఇలాంటి ఆత్మహత్యలు 5 నమోదైనట్లు స్థానిక వర్గాల ద్వారా తెలిసింది.

**ప్రభుత్వ నిర్లక్ష్యం..**

ఈ ఆర్థిక నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసు శాఖలు తీవ్రంగా విఫలమవుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ నెట్‌వర్క్ బిజినెస్‌లను నియంత్రించేందుకు సమర్థవంతమైన చట్టాలు, అమలు విధానాలు లేకపోవడం ఒక ప్రధాన సమస్య. ఏసీబీ, పోలీసు శాఖలు కొన్ని కేసుల్లో చర్యలు తీసుకున్నప్పటికీ, నిందితులు పరారీ కావడం, రికవరీ జరగకపోవడం వల్ల బాధితులకు న్యాయం దూరమవుతోంది. గత రెండేళ్లలో జిల్లాలో నమోదైన దాదాపు 1,200 ఆర్థిక నేరాల కేసుల్లో కేవలం 15శాతం కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్ష పడినట్లు తెలిసింది. జిల్లాలో ఆర్థిక నేరాలు సామాన్యుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. చిట్‌ఫండ్ కుంభకోణాలు, దొంగ బంగారం మోసాలు, నెట్‌వర్క్ బిజినెస్ దోపిడీలు జిల్లా ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టకపోతే ఈ నేరాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. బాధితులకు న్యాయం చేయడంతో పాటు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోసాలను అరికట్టేందుకు సమర్థవంతమైన చట్టాలు,వాటిని కఠినంగా అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

### మృతి చెందిన సాయి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నసీర్ పరామర్శ



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తొమ్మిదో డివిజన్ ప్రెసిడెంట్ కన్నబోయిన సాయి మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ఆయన స్వగృహానికి వెళ్లి ఘన నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీకి సాయి చేసిన సేవలు ఎనలేనివని చెప్పారు. మొదటి నుంచి నిబద్ధతగల కార్యకర్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కుట్రలు, కుతంత్రాలు ఎదుర్కొని నిలబడ్డారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి అని, పార్టీ కష్టకాలంలో అండగా నిలిచారని పేర్కొన్నారు. సాయి మృతి తనను బాధించిందని, కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కార్యకర్త నిధి ద్వారా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.

## కార్యకర్తలకు అండగా వైసీపీ

### ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

### సింగయ్య కుటుంబానికిరూ. 5లక్షలు అందజేసిన బలసాని



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కార్యకర్తలకు అండగా నిలవడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కార్యకర్తల సంక్షేమం కూడా పార్టీకి ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన నేపథ్యంలో ఏటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సింగయ్య కుటుంబాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదితర నేతలతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ వ్యక్తిగతంగా సింగయ్య కుటుంబానికి 5లక్షల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి సింగయ్య పార్టీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే వారన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వైయస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ తరుపున సింగయ్య కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన సంగతి అందరికీ తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు. తాజాగా బలసాని కిరణ్ కుమార్ 5 లక్షలు అందజేయడం కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం పట్ల అటు పార్టీకి ఇటు పార్టీ నేతలకు గల నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనమని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ అధినేత వైయస్ జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా తన నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను తన సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే సింగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. పార్టీ నేతలు మెట్టు వెంకటప్పారెడ్డి, దుగ్గింపూడి యోగీశ్వరరెడ్డి, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కరీముల్లా పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

**– గార్డెన్స్ దగ్గర ఔట్ ఫాల్ డ్రైన్ పై నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు**
**– నగర కమిషనర్ పులి శ్రీనివాసులు**



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హౌసింగ్ బోర్డ్ కాలనీ, నల్లకుంట, ఎన్జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను, చుట్టగుంట జంక్షన్ వద్ద రోడ్, డ్రైన్ ఆక్రమణలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు సమర్ధవంతంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి పని నిర్దేశిత గడువు మేరకు పూరి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్ లను చేపట్టాలని, హౌసింగ్ బోర్డ్ కాలనీ మామిడి గార్డెన్స్ దగ్గర ఔట్ ఫాల్ డ్రైన్ పై నూతన కల్వర్ట్ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని డిఈఈని ఆదేశించారు. ఏఈల పరిధిలో ప్రతి రోజు త్రాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం చుట్టగుంట సెంటర్‌లో రోడ్, డ్రైన్ ఆక్రమణలు పరిశీలించి, 2 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్యతో పాటు డ్రైన్లలో మురుగుపారుదలకు అడ్డుగా ఉంటుందన్నారు. ఆక్రమణలను ఎట్టి పరిస్తితుల్లో ఉపేక్షించ వద్దని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో డిఈఈ వెంకట రమణ, ఎస్ఎస్ రాజేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బడిమానేసిన వారికి సువర్ణ అవకాశం



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో సోమయాజులు అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ యందు అడ్మిషన్ డ్రైవ్ పై శిక్షణ కార్యక్రమం జరిగింది. సోమవారం వారు మాట్లాడుతూ వివిధ కారణాల చేత చదువు మధ్యలో మానివేసిన వారి కొరకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి చదువుకునే అవకాశం లేని వారికి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానం– దూర విద్యా విధానం ద్వారా పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ చదువును కొనసాగించటానికి ఇది సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు. పేదరికం చదువుకు ఆటంకం కాకూడదు అనే లక్ష్యంతో దూర విద్యా విధానం ద్వారా చదివి ఉన్నత స్థాయికి వెళ్లిన వారు అనేకమంది ఉన్నారని గుర్తు చేశారు. గ్రామస్థాయిలో సచివాలయాల ద్వారా అంగన్వాడీ సిబ్బంది ద్వారా చదువుకు దూరమైన వారికి తెలియపరచాలని కోరారు. అనంతరం దూరవిద్య పాఠశాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఈవో పి ఆర్ డి.కే.శరత్ బాబు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,కెవి రమణ, ఎం.శివ నాగేశ్వరరావు,సచివాలయం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్స్,అంగన్వాడి ఆశా వర్కర్స్,గ్రామ మహిళా పోలీస్, సార్వత్రిక విద్యాపీఠం ఏ ఐ సమన్వయకర్త పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వధ్యేయం

**– మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాజి కిరణ్ చంద్**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాజి కిరణ్ చంద్ అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ స్పూర్తితో మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు టిట్కోగృహ సముదాయాల వద్ద దివీస్ ల్యాబరేటరీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సుజలా సురక్షిత వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆయన డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్ కుమార్, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ... మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. టిట్కో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు దివీస్ లేబరేటరీ వారి సహకారంతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లపోతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, అందులో భాగంగా టిట్కోవాసులకు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కరరావు, టిడిపి నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, మర్రి, ఏసుబాబు రుద్రు కోటేశ్వరరావు, కొల్లి వెంకటరావు, తోట శ్రీనును, బత్తుల నాగరాజు, రుద్రు రాజేష్, తోట గోపి తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలి

**– కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు**



**గుంటూరు మేజర్ న్యూస్ :** అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింపచేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు కోరారు. సోమవారం 2/7 బ్రాడిపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో కె.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 నుండి 70 శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారని, వీరికి గుర్తింపు కార్డులు పంట ఋణాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి అంటే భూ యజమాని సంతకం కావాలనే నిబంధన వల్ల గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారన్నారు. వరి, ప్రత్తి, మిర్చి, శనగ, నల్లబర్లీ పొగాకు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎమ్. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలం చినకొండూరు లంకభూముల రైతులకు వ్యక్తిగత పంట ఋణాలు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో షుమారు లక్ష మంది కౌలురైతులున్నారని, వీరికి గుర్తింపు కార్డులిచ్చి పంట ఋణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో లీడ్ బ్యాంక్ 170 కోట్లు కౌలు రైతులకు ఋణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆచరణలో అమలు చేయడం లేదని, కౌలు రైతులు అప్పులపాల్కై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎమ్.సాంబిరెడ్డి, పి.కృష్ణ, అమ్మిరెడ్డి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి




**పెదనందిపాడు : మేజర్ న్యూస్ :**

పాఠశాల అభివృద్ధి కొరకు, విద్యార్థులకు పౌష్టికహారం అందిస్తున్న దాతల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకొని బాగా చదివి ప్రయోజకులు కావాలని ఎమ్ఈఓ కెనడీ అన్నారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని వరగాని ఎస్ డబ్ల్యూ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికహారంలో భాగంగా దాత నిమ్మగడ్డ నాగేశ్వరరావు సాయంతో విద్యార్థులకు పెరుగు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కొరకు దాతల సహకారం మరువలేనిదని పాఠశాల జరిగిన అన్ని రోజులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లో భాగంగా పెరుగు అందిస్తున్నదాత నిమ్మగడ్డ నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిర పడి, గ్రామానికి, పాఠశాలకు సహకారం అందించాలని అయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామారావు, గ్రామ పెద్దలు చెన్నుపాటి శివనాగేశ్వరరావు, బండారు రాంబాబు, చెన్నుపాటి సురేంద్ర, నూతి పూర్ణచంద్రరావు, పీఎంసీ చైర్మన్ కె సంతోషం, వైస్ చైర్మన్ నీలం తిరుపతమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సుధారాణి, అరుణ, ధనలక్ష్మి, విద్యార్థులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ

# కార్యకలాపాల నిర్వహణకు నూతన కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్:** ఈరోజు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఐపిఎస్ ఆధ్వర్యంలో నరసరావు పేటలోని పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించబడిన ఆధునిక కాన్ఫరెన్స్ భవనాన్ని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఐపీఎస్ ఘనంగా ప్రారంభించారు వేద మంత్రోచ్చారణ నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో ఐజీ కి జిల్లా పోలీసు అధికారులు పోలీస్ గార్డుతో వందనం సమర్పించగా, ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఐపీఎస్ ఐజీ కి భవన నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తూ శ్రద్ధగా వెంట ఉన్నారు ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ నూతనంగా నిర్మించబడిన ఈ కాన్ఫరెన్స్ హాల్ పోలీస్ శాఖకు చాలా ఉపయోగకరంగా ఉండనుందని, ముఖ్యంగా క్రైమ్ రివ్యూలు శాఖాపరమైన అంతర్గత సమావేశాలు శిక్షణా కార్యక్రమాలు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఐజీ జిల్లాకు చెందిన ముఖ్యాధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించి మొదటి క్రైమ్ రివ్యూ సమావేశాన్ని నూతన హాలులో నిర్వహించారు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఐపీఎస్ మాట్లాడుతూ ఈ హాల్‌ను ఉపయోగించి బ్యాంకర్లతో సంబంధిత భద్రతా సమీక్ష సమావేశాన్ని ప్రారంభ కార్యక్రమంగా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే స్కూలు మరియు కాలేజీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మాదక ద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, అలాగే మహిళల రక్షణ కోసం శక్తి టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమం అనంతరం భవన నిర్మాణానికి కృషి చేసిన పోలీసు అధికారులకు మరియు కలెక్టర్ కి దుస్సలువాతో సత్కరించి మెమంటాలను ఐజి అందజేశారు ఈ కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఐపీఎస్జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులు ఏవో దుర్గా ప్రసాద్ సిబ్బంది, పాల్గొన్నారు...



# అంగన్వాడి నిర్వహణకు ట్యాబులు 5జి నెట్వర్క్ తో సప్లై చేయాలి

**ప్రత్తిపాడు: మేజర్ న్యూస్ :** అంగన్వాడీ నిర్వహణకు ప్రభుత్వం ట్యాబులను ప్రభుత్వం 5జి నెటవర్క్ లో అనుసంధానం అయిన ట్యాబులను ఇవ్వాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపులో భాగంగా ఐసిడిఎస్ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్లు అందరూ ప్రభుత్వం తమకు ఇచ్చిన సెల్ ఫోన్లను, సిమ్‌లతో సహా తిరిగి సిడిపిఓ ఆఫీసులో సబ్మిట్ చేసేందుకు అన్ని సెక్టార్ల నుండి తరలి వచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రేమలత, కే పద్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు ఇప్పటికే ఐదు సంవత్సరాలు అయిందని ఫోన్లు 2జీబీ ర్యామ్ తో ఫోర్ జి నెట్వర్క్ కలిగిన ప్రభుత్వం ఇచ్చిన ఆన్లైన్ వర్కులకి సహకరించడం లేదని తెలిపారు. సెల్‌ఫోన్లు మార్పు చేయమని పదేపదే చెబుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని, అన్ని యాప్లో పనితో అంగన్వాడి వర్కర్లు మానసిక వేదనకు గురవుతున్నారని, అనారోగ్య పాలవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణకు ట్యాబులు ఇస్తామని చెప్పిందని నేటికీ ఇవ్వడం లేదని సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు ఎక్కడ అమలు కావడం లేదని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ లగా మారుస్తామని మంత్రివర్గం తీర్మానం చేసిందని నేటికీ జీవో అమలు కావడం లేదని, ఐదు సంవత్సరాలు అవుతున్న వేతనాలు పెంపు కూడా లేదని, సెంటర్ నిర్వహణకు అన్ని యాప్లను కలిపి ఒక యాప్ గా ఏర్పాటు చేయాలని, 5జి నెట్వర్క్ కలిగి నా ట్యాబ్‌లను ఇవ్వాలని అప్పటివరకు ఆన్లైన్ వర్క్ లేవి చేయకూడదని, ఇప్పటివరకు వైద్య, ఆరోగ్యశాఖ చేస్తున్న ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం అంగన్వాడి వర్కర్లను చేయమని చెబుతున్నారని ఈ పథకం అంగన్వాడీలు చేయరని చెబుతూ ఐసిడిఎస్ సిడిపిఓ అంగన్వాడీ కార్యకర్తల సెల్ఫోన్లను తిరిగి ఇచ్చేందుకు రాగా సిడిపిఓ తీసుకోవటానికి నిరాకరించారు. ఐదో తేదీ నుండి ఆన్లైన్ సేవలు పూర్తిగా ఆపివేసి ఆఫ్లైన్లోనే పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోశాధికారి నగరాజకుమారి, ప్రాజెక్టు నాయకులు శివ పార్వతి, శ్రీ వాసవి, సుభాషిని, నవరత్నమని, విజయ, కమల జ్యోతి , శశికళ తదితరులు పాల్గొన్నారు.



# విరవట్నంలో సాగునీటి వినియోగదారుల సంఘం భవనం ప్రారంభం

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామంలో డాక్టర్ చదలవాడ అరవింద బాబు సాగునీటి వినియోగదారుల సంఘం భవనం సోమవారం ఆగస్టు 04, 2025 నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిరుమామిళ్ల మల్లికార్జునరావు, సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ తన పేరుతో సాగునీటి వినియోగదారుల సంఘం భవనం నిర్మించడం ఆనందదాయకమని, ఇది రైతుల సంక్షేమానికి కృషి చేసే సంస్థగా ఉంటుందని అన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు రైతులకు నీటి సరఫరా, నిర్వహణ, మరియు సాగు సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి వినియోగదారుల సంఘాలు రాష్ట్ర వ్యవసాయ రంగంలో ముఖ్యమైన భూమిక వహిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,022 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, ఇవి దాదాపు 14.5 లక్షల హెక్టార్ల సాగు భూమికి నీటిని సరఫరా చేస్తున్నాయని అన్నారు. ఈ సంఘాలు 12 లక్షలకు పైగా రైతులకు సేవలు అందిస్తూ, నీటి వినియోగంలో సమర్థతను పెంచడంతో పాటు, నీటి పంపిణీలో సమానత్వాన్ని నిర్ధారిస్తున్నాయని అన్నారు. ఈ సంఘాలు నీటి నిర్వహణలో 30–40శాతం సామర్థ్యాన్ని పెంచినట్లు అధ్యయనాలు చెబుతున్నాయని అన్నారు. గత ఐదేళ్లలో ఈ సంఘాల ద్వారా నీటి పంపిణీ వ్యవస్థలో జరిగిన మెరుగుదలల కారణంగా రైతుల ఆదాయంలో 15–20% వృద్ధి సాధ్యమైంది," అని గణాంకాలతో సహా తెలిపారు. ఈ భవనం రైతులకు సాగునీటి సమస్యలను చర్చించే వేదికగా, సాంకేతిక సలహాలు అందించే కేంద్రంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, నాయకులు ఈ సంఘం ద్వారా స్థానిక వ్యవసాయ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# స్మశాన వాటికల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం

### – ఆత్మకూరులో నాలుగు స్మశాన వాటికలు, నవులూరులో క్రైస్తవ స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు, నవులూరులో పలు స్మశాన వాటికల అభివృద్ధికి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు ఆయా స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు మాట్లాడుతూ... రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో ఆత్మకూరులోని కాపు, రెడ్డి, పద్మశాలి, గౌడ స్మశాన వాటికల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఆయా స్మశాన వాటికల్లో, అంతిమ సంస్కారాల షెడ్డు, లాకర్, బాత్రూమ్ లు, వాహన షెడ్డు, అంతర్గత రోడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, గ్రీనరీ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గతంలో కాపు, గౌడ స్మశాన వాటికలకు ప్రహరీ గోడలు నిర్మించగా మిగిలిన స్మశాన వాటిక లకు ప్రహరీ గోడల నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మంత్రి లోకేష్ ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. స్మశాన వాటికల అభివృద్ధికి ముందుకొచ్చిన మంత్రి లోకేష్ కు గ్రామస్తులు, స్థానిక నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు తాటి వెంకట్రావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాన్యం మల్లీశ్వరి, శానం మాణిక్యాలరావు, వేణుగోపాల స్వామి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ మోదుకూరి రవికుమార్, శివాలయం ట్రస్ట్ బోర్డు మెంబెర్ సంగెపు భావనాబుషి, జొన్నకూటి శ్రీనివాసరావు, తాత కోటయ్య, మాన్యం సుబ్బారావు, పడమట దుర్గారావు, గద్దె రామస్వామి, పద్మశాలి సంఘ పెద్దలు పుట్ట దయామూర్తి, పుట్ట శ్రీను, యలమర్ది రామారావు, బీసీ సంఘ పెద్దలు తమ్మిశెట్టి రమణయ్య, మాన్యం సాంబయ్య, పడమటి పుల్లారావు, మధు, కాపు సంఘపెద్దలు మల్లాది జయకృష్ణ, తిరుమలశెట్టి పెద కోటయ్య, దూళిపూడి సీతారామయ్య, ఆకాశం రామకృష్ణ, సోమరోతు శివ నాగేశ్వరరావు, మోతుకురి రవి, మల్లాడి జయకృష్ణ, వసంత రావు, ఆకాశం శివరామకృష్ణ, తిరుమలశెట్టి పెద్దకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

**నవులూరులో...**

మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు క్రైస్తవ స్మశాన వాటిక (సమాధుల తోట)కు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. సమాధుల తోటలో మౌలిక వసతులు లేకపోవడంతో పాటు కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోండటంతో మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి నుండి సమాధుల తోటను ఎవరూ పట్టించుకోలేదని, మంత్రి నారా లోకేష్ అభివృద్ధికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సమాధుల తోటలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి నారా లోకేష్ త్వరితగతిన మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, పాస్టర్లు సత్యప్రకాష్, శామ్యూల్, దాసు, ఏసురత్నం, నాయకులు మట్టికొయ్య చక్రవర్తి, మాతంగి బాబురావు, మట్టికొయ్య అశోక్, బేతపూడి మల్లేశ్వరరావు, మట్టికొయ్య శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలకు అండగా వైసీపీ

### – ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
### – సింగయ్య కుటుంబానికి 5లక్షలు అందజేసిన బలసాని కిరణ్



**గుంటూరు మేజర్ న్యూస్ :** కార్యకర్తలకు అండగా నిలవడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కార్యకర్తల సంక్షేమం కూడా పార్టీకి ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన నేపథ్యంలో ఏటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సింగయ్య కుటుంబాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదిదర నేతలతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ వ్యక్తిగతంగా సింగయ్య కుటుంబానికి 5లక్షల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి సింగయ్య పార్టీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే వారన్నారు. ఆయన మరణం పట్ల తన సానుభూతిని వ్యక్తం చేశారు. సింగయ్య కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున అన్ని విధాలా అండగా నిలుస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో ఇప్పటికే వైయస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ తరుపున సింగయ్య కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన సంగతి అందరికీ తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు. తాజాగా బలసాని కిరణ్ కుమార్ 5 లక్షలు అందజేయడం కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం పట్ల అటు పార్టీకి ఇటు పార్టీ నేతలకు గల నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనమని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా తన నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను తన సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే సింగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మెట్టు వెంకటప్పారెడ్డి, దుగ్గెంపూడి యోగీశ్వరరెడ్డి, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలు తనిఖీ

**యడ్లపాడు, మేజర్ న్యూస్ :**

పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను స్థానిక తహసిల్దార్ విజయశ్రీ ఇంచార్జ్ ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్,మండల వ్యవసాయ అధికారి ఏ. హరిప్రసాద్ సోమవారం తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో భాగంగా మండల కేంద్రమైన యడ్లపాడు లో మన గ్రోమోర్ సెంటర్ మరియు వికేపి ఆగ్రో ట్రేడర్స్ అను ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో షాపు నందు నిల్వ ఉన్న ఎరువులను స్టాక్ రిజిస్టర్ నిల్వలతో మరియు ఈ పోస్ నిల్వలతో సరిచూశారు అలాగే నిత్యవసరాల చట్ట ప్రకారం ధరలు పట్టిక, లైసెన్స్ డిస్ ప్లే చేసినదీ లేనిది తనిఖీ చేశారు . ఈ సందర్భంగా తహసిల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరకు అమ్మ రాదని అలాగే ప్రతి బస్తాను ఈ పోస్ ద్వారా బిల్లు చేయవలెనని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఆధీకృత డీలర్ వద్దనే ఎరువులు కొనుగోలు చేయవలెననీ, అలాగే రైతులు తప్పనిసరిగా బిల్లు పొందవలెనను పేర్కొన్నారు. ఎవరైనా అధిక ధరలు అమ్మిన అనధికారిక విలువలు ఉంచినా వాటి వివరములను స్థానిక వ్యవసాయ అధికారికి తెలిపినచో చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్,వీఆర్వో భాష పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

**– జిల్లా కలెక్టరు పి. అరుణ్ బాబు**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు సోమవారం స్ధానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను జిల్లా కలెక్టరు పి అరుణ్ బాబు స్వీకరించారు. జిల్లా కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 91 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ–ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తి స్ధాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో ఏపీని మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకం

**– రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ విద్యలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో మాజీ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగాయని, అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటుచేయడంపై ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు.

**ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం :**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఇకపై ఆయా జిల్లాల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోండూరు శ్రీనివాసరాజు, బొనిగెల హైమారావు, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్.రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యం

**పెదనందిపాడు, మేజర్ న్యూస్ :** బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యం అని తల్లి పాలను మించిన ఔషాదం లేదని ఎంపీడీఓ లక్ష్మి దేవి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ పౌష్టికహారం తీసుకోవాలని, అలా తీసుకుంటే బిడ్డ పుట్టిన తర్వాత వారికి ఆరోగ్యకరమైన పాలు బిడ్డకు అందుతాయని ఆమె చెప్పారు. గర్భిణీ స్త్రీ లకు ప్రతి విషయంలో అంగన్వాడీ కార్యకర్తలు సలహాలు, సూచనలు అందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కరీముల్లా,ఏపీఎం సుబ్బారావు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు కానిస్టేబుల్‌లు గా ఎంపికవటం పట్ల ఆ గ్రామంలో మిన్నంటిన సంబరాలు



**నకరికల్లు, మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుల్‌లుగా ఎంపికయ్యారు. ఒకేసారి ముగ్గరు పోలీస్ డిపార్ట్మెంట్ కు ఎంపికవడంతో ఆ గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. గుండ్లపల్లి గ్రామానికి చెందిన నాగుల్ మీరా (సివిల్ కానిస్టేబుల్), నాగుల్ (ఏ.పి.ఎస్.పి), చింతల చెరువు కిషోర్. (ఏ.పి.ఎస్.పి)లు కానిస్టేబుల్ లుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డా.బుడే వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు ముగ్గురు ఒకేసారి పోలీస్ డిపార్ట్మెంట్ కు ఎన్నికవడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్తులో వీరు ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని,వారు చేసే వృత్తిలో మంచి పేరు సంపాదించి వారి శాఖకు,గ్రామానికి,తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# తల్లిపాలు శ్రేష్టం

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ఆరోగ్యానికి శ్రేష్టమని డాక్టర్ ఆదిత్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల అధికారులతో కలిసి తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని ఫీడింగ్ సెంటర్ ను డాక్టర్ల బృందం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సోమయాజులు ఎంఈఓ 2 సత్యనారాయణ, సూపర్వైజర్ ఇమాంబి, మాధవి అంగన్వాడీ టీచర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.





# రైతు వారీ అర్జీలు వెంటనే పరిష్కరించండి తహసీల్దార్ విజయశ్రీ



**యడ్లపాడు, మేజర్ న్యూస్ :**

మండలంలోని రైతులు ఏవైనా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే వాటిని త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ విజయశ్రీ గ్రామ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక కారణాలతో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు పొందని రైతులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు తో సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు భూయజమానులకు పొలం, ఆధార్ వివరాలు వెబ్ ల్యాండ్ లో తప్పుగా నమోదు కావటంతో అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదన్నారు. సదరు రైతులు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్, 1బీ నకలుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల వివరాలు ఆన్లైన్ నమోదు చేసిన అనంతరం అన్నదాత సుఖీభవ పథకం నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు .

# సక్రమంగా పనిచేయని ఫోన్‌లతో పెరిగిన పని ఒత్తిడి

**– సిడిపిఓ కార్యాలయంలో ఫోన్లు అందజేత**





**నరసరావుపేట మేజర్ న్యూస్ :** ఒకవైపు యాప్‌ల భారం మరోవైపు సక్రమంగా పనిచేయని ఫోన్లతో అంగన్వాడీలకు పని ఒత్తిడి పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీల వద్ద ఉన్న ఫోన్‌లను ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు మొత్తం నరసరావు పేట ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఓ కాంత కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన విరమించుకోవాలన్నారు. ఫోన్ సక్రమంగా పనిచేయక, సరుకులు నెలలో ఒక్కసారిగా ఇవ్వకపోవడం వంటి కారణాలతో అంగన్వాడీలతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మాతా, శిశువు సంరక్షణలో అంగన్వాడీల పాత్ర కీలకమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని కోరారు. 5జి ఫోన్లు పంపిణీ చేయాలని యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రభుత్వం దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లారని అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ ఫోన్లు పంపిణీ చేయకపోవడాన్ని నిరసిస్తున్నామన్నారు. 5 జి ఫోన్లు పంపిణీ చేసి యాప్ లు క్రమబద్ధీకరించే వరకు రికార్డులలో లబ్ధిదారులచే సంతకాలు చేయించి పోషకాహారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమ్మెలు, ధర్నాలు ఏమీ చేయడం లేదని పని ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో రికార్డుల ద్వారా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు కవిత, నిర్మల, అంగన్వాడీలు మాధవి, విజయలక్ష్మి, రమణ, కమురూన్, హసీనా, ఏలీనా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలకు అండగా టిడిపి

**– గుండ్లపాడులో త్రాగునీటి సమస్యకు పరిష్కారం**





**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు కొంతకాలంగా త్రాగునీటి సమస్యతో తీవ్రంగా బాధపడుతుండగా, టిడిపి నేతలు తమ అండగా నిలిచారు. గ్రామస్థుల వినతిని పరిగణలోకి తీసుకున్న టిడిపి నాయకుడు తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులు ఈ సమస్యను వెంటనే ప్రాధాన్యతతో తీసుకున్నారు. ఈ విషయాన్ని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డికి తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి త్రాగునీటి సమస్య పరిష్కారానికి కావాల్సిన కొత్త బోరు మోటారును ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశారు. తోట వీరాంజనేయులు త్వరితగతిన చర్యలు తీసుకొని కొత్త మోటార్‌ను అందించడంతో ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోట వీరాంజనేయులు మాట్లాడుతూ – "కూటమి ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉంటే, అవన్నీ తాము శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం" అని తెలిపారు. ఆయన హామీ ఇవ్వడం, మద్దతుగా నిలవడం పట్ల కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో స్మశాన వాటిక అభివృద్ధి అభినందనీయం

**– మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్**
**– నవులూరులో హిందూ స్మశానవాటిక ప్రారంభం**




**మంగళగిరి, మేజర్ న్యూస్ :**
దాతల సహకారంతో స్మశాన వాటికను అభివృద్ధి చేయడం అభినందనీయమని మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరులో గైరుబోయిన సాంబశివరావు కుమారులు వాసు, వేణుబాబులు సుమారు రూ. 30లక్షలతో హిందూ స్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సోమవారం మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ స్మశాన వాటికను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... గైరబోయిన సాంబశివరావు పేరుతో ఆయన కుమారులు హిందూ స్మశాన వాటికను పార్కును తలపించే రీతిలో తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ గైరుబోయిన వాసు, వేణుబాబులు వారి తండ్రి సాంబశివరావు జ్ఞాపకార్థం హిందూ స్మశాన వాటికలో రూ. 30లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ తండ్రి సాంబశివరావు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్నారని ఆయన పేరు గ్రామస్తులందరికీ చిరస్థాయిగా గుర్తు ఉండాలనే ఉద్దేశ్యంతో హిందూ స్మశాన వాటికను నగరపాలక సంస్థ సహకారంతో సుందరంగా నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం స్మశాన వాటిక తాళాలను గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, మర్రి ఏసుబాబు, రుద్రు కోటేశ్వరరావు, మల్లవరపు వెంకట్, కొల్లి వెంకటరావు, తోట శ్రీనుబాబు, తెల్ల మేకల నాగేశ్వరరావు, కొత్త శ్రీను, బత్తుల నాగరాజు, రుద్రు శీను, పొనం శ్రీను, రుద్ర వీర రాఘవులు,తోట గోపి, రుద్రు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# జే ఎం జే కళాశాలలో వైద్య శిబిరం

**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక జేయంజే కళాశాలలో మున్సిపాలిటీ ప్రజారోగ్యం శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు ఆధ్వర్యంలో సుల్తానాబాద్, పినపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందించారు. కళాశాలలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో కలుషిత ఆహారం తిని ఉపాధ్యాయులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్యేశిబిరం నిర్వహించినట్లు తెలుస్తోంది. శిబిరంలో ఎంఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు ఎస్ఐగా నరహరి



**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నూతన ఎస్ఐగా నరహరి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ నరహరి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ నాగేంద్ర పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న నరహరి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నరహరి కి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# ఎంఈవో పోస్టుల్లో జెడ్పీఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి

**– ఉపాధ్యాయుల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ**

**మంగళగిరి, మేజర్ న్యూస్ :**
ఉండవల్లి ప్రభుత్వ విద్యలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో మాజీ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగాయని, అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటుచేయడంపై ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు.

**ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం :**
ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఇకపై ఆయా జిల్లాల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోండూరు శ్రీనివాసరాజు, బొనిగెల హైమారావు, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్.రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల హాస్పటల్లో ఉచిత వైద్య శిబిరం

**– దాదాపు 200 మందికి వైద్య సేవ**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
నరసరావు పేటలోని అరండల్ పేటలో ఉన్న నంద్యాల హాస్పటల్లో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు దాదాపు 200 మందికి వైద్య సేవలు పొందారు డాక్టర్ నంద్యాల రామ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో రూ. 3,000 విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడింది. ఈ శిబిరంలో పలు వైద్య పరీక్షలు సీబీపీ, సిఅర్పి , ఆర్బిఎస్ , ఎక్సరే , ఈసీజీ, పిఎఫ్టి , సియుఈ మరియు అల్ట్రా సౌండ్ స్క్రీనింగ్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు . రోగులందరికి 20శాతం రాయితీతో మందులు అందజేశారు. డాక్టర్ నంద్యాల రామ్ ప్రసాద్ రెడ్డి పల్మనాలజీ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రదీప్ విజయ్ కుమార్ బోరుగడ్డ జనరల్ సర్జన్ మరియు డాక్టర్ మోనిక గోపాలం ఈఎన్టి సర్జన్ డాక్టర్ వశిష్ట రెడ్డి రేడియాలజిస్ట్ వైద్య సేవ లు అందించారు. ఈ వైద్యులు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, ఏఆర్డిఎస్ సిఓపిడి ఐఎల్డి బ్రాంకియక్టాసిస్, లంగ్ ఎబ్సెసెస్, ఏఆర్డిఎస్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఊపిరితిత్తుల రుగ్మతలు ఓఎస్ఏ వంటి వ్యాధులపై సేవలు అందించారు. నందల హాస్పిటల్స్ ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి ఆరోగ్య సేవలు అందించడంలో ముందున్నట్లు తెలుస్తోంది.




# సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి : మద్దిరాల గంగాధర్




**పెద్దకూరపాడు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు రైతులకిచ్చిన హామీని అమలు చేయడంలో కేంద్రం సహకారంతో రాష్ట్రం నుండి 5వేల రూపాయలు,కేంద్రంనుండి 2 వేల రూపాయలు మొత్తంగా 7 వేల రూపాయలు తొలివిడతగా రైతులకు వారి ఎకౌంట్లో జమ చేయడం హర్షణీయమన్నారు. సంవత్సరానికి 20 వేల రూపాయలను ప్రతి సంవత్సరం రైతులకు వారి ఎకౌంట్లలో జమ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరియు తొలివిడతలో 7వేల నగదు జమ అవడం రైతు సోదరులలో సంతోషాన్ని నింపిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని వైసిపి పాలనలో రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలోను.. కౌలు రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉండటం రైతుల పట్ల జగన్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని అన్నారు. రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబుకు రైతుల కష్టాలు తెలుసునని అందుకే పెద్ద మొత్తంలో సాయం అందిస్తున్నారని తెలిపారు. అలాగే ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతులు ఖాతాలలో డబ్బులు చేశారని చెప్పారు. రైతు గెలవాలి వ్యవసాయం నిలవాలనేది చంద్రబాబు సంకల్పమని రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# బిజెపి జెండలను పీకివేసిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాబురావు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పర్యటన సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ బిజెపి పార్టీల జండాలను కట్టినా బిజెపి నాయకులు బిజెపి నాయకులు కనీసం అంబేద్కర్ కి ఒక దండ కూడా వేయకపోవడం విడ్డూరంగా ఉందని అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న బిజెపి జెండలను తీసివేసిన బుదాల బాబూరావు.

# జీవితంలో అన్నీ ఉండాలి

## విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

## విజ్ఞాన్స్ లారాలో బీటెక్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** విద్యార్థుల జీవితాల్లో ( సంతోషం, బాధ, కష్టాలు, నష్టాలు, ఒడిదొడుకులు) అన్నీ ఉండాలని... అప్పుడే వారు ఉన్నతంగా ఎదుగుతారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో మా కళాశాలను ఎంచుకుని విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేది సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని పేర్కొన్నారు. విద్యార్థులకు నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచసూత్రాల (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, 2.ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, 3.కౌన్సిలింగ్ సిస్టమ్, 4.సీఆర్‌టీ తరగతులు, 5.బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ మీ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లైతే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని తెలియజేసారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రెడిట్స్‌ను అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులందరూ చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందని వారిలో కమ్యూనికేషన్, టీమ్ స్పిరిట్ పెంచడానికి కళాశాలలో ఎప్పుడూ ఏదో ఒక ఈవెంట్స్‌ను నిర్వహిస్తామని తెలియజేసారు. ఇప్పటివరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికే మాత్రమే ప్రిపేర్ అయ్యింటారని, ఇప్పటినుంచి మాత్రం జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ అవ్వాలని పిలుపునిచ్చారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులలో 75 శాతం మంది పిల్లలకు మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ తమ కళాశాలలో కౌన్సిలింగ్ సిస్టంద్వారా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక అ్యధ్యాపకుడిని నియమిస్తామని చెప్పారు. దీని ద్వారా విద్యార్థులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి అభ్యున్నతికి, పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతామన్నారు. తమ కళాశాలలో పనిచేసే అధ్యాపకులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం వలన నూటికి నూరు శాతం ఫలితాలను సాధిస్తున్నామన్నారు. మొదటి సంవత్సరం నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ మరియు విద్యార్థులను గ్లోబల్ కోడింగ్ ప్లాట్‌ఫామ్‌లు అయినటువంటి లీట్ కోడ్, కోడ్చెఫ్, హ్యాకర్ రాంక్‌లలో ప్రాక్టీస్ చేయించడము వలన విద్యార్థులు మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండు వారాల పాటు ప్రత్యేకంగా నిర్వహించే ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకపు ఉత్తర్వులు జారీ

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలసి కారుణ్య నియమకాలకు సంబంధించి జే. వంశీ క్రిష్ణ కు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా నియమిస్తూ జారీ చేసిన నియామక ఉత్తర్వులను అందించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ నిబద్ధతతో, అంకితభావంతో ప్రభుత్వ సర్వీసును క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, ఎస్.సి.కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, డిఆర్‌ఓ ఖాజావలి,ఆర్.డి.ఓ. శ్రీనివాసరావు జెడ్పీ సిఇఓ జ్యోతిబాసు, హౌసింగ్ పిడి ప్రసాద్, సిపిఓ శేషశ్రీ, డి.ఇ.ఓ రేణుకా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, డిఎంఅండ్ హెచ్ఓ., డా. విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, డీడీ పశు సంవర్ధక శాఖ డా.కేవివి. సత్యనారాయణ, గ్రామ/ వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్ , డిఎఫ్ఓ హిమ శైలజ, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి.పవన్ కుమార్, ఏపిఎంఐపి పిడి వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు



# నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పి4.ను విజయవంతం చేయాలి



**గుంటూరు, మేజర్ న్యూస్** జిల్లాలో ప్రభుత్వం, దాతలు, ప్రజలు బాగస్వామ్యం (పీ4) కార్యక్రమంకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బంగారు కుటుంబాలను, మార్గదర్శులతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ పూర్తి అయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ప్రభుత్వ, దాతలు, ప్రజలు బాగస్వామ్యం (పీ4) కార్యక్రమం, హౌసింగ్, అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ పీ4 కార్యక్రమానికి గుర్తించిన బంగారు కుటుంబాలను, ప్రొఫెషనల్స్, అసోసియేషన్లు, వ్యాపార సంస్థల కేటగిరిలోని మార్గదర్శులు దత్తత తీసుకునేలా రోజువారీగా నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా నూరు శాతం అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ4 నీడ్ అసెస్మెంట్ సర్వే ను అగష్టు 7వ తేది నాటికి పూర్తి చేయాలన్నారు. లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదనపు సహాయం ద్వారా నిధులు మంజూరు చేసిన వారు ఖచ్చితంగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అదనపు సహాయం తీసుకొని ఇళ్ళు నిర్మాణాలు పూర్తి చేసుకొని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి అదనపు నగదు తిరిగి తీసుకుంటామాని తెలియ చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం పనుల ప్రతిపాదనలు వారం చివరి నాటికి అందించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ పరిధిలో ఐటీఐ, జూనియర్ ఇంటర్ విద్యార్హత ఉన్న వారి హెూం టూ వర్క్ సర్వేను పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం పథకం లో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్ ఈ కేవైసీ పెండింగ్ ఉన్నవి వెంటనే పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ లో అందించిన అర్జీలు విత్ ఇన్ ఎస్-ఎల్ఏ లో ఖచ్చితంగా పరిష్కరించాలన్నారు. డీ వార్మింగ్ డే కార్యక్రమంకు వైద్యారోగ్యశాఖ, విద్యా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. సూక్ష్మ, చిన్న, మద్య తరహా పరిశ్రమలు అభివృద్ధికి, ప్రోత్సాహానికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు మండలాలు, పట్టణాల్లో నిర్వహించే ఉద్ధమ్ వర్క్‌షాపులను నిర్దేశించిన మార్గదర్శకాలతో పరిశ్రమల శాఖను సమన్వయం చేసుకొని ఎంపీడీవోలు, కమిషనర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఓ శేషశ్రీ, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాదు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా పంచాయితీ అధికారి సాయికుమార్ పాల్గొన్నారు.

### స్వాతంత్ర దినోత్సవం వేడుకలపై కలెక్టర్ సమీక్ష

**గుంటూరు, మేజర్ న్యూస్ :** జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ తో కలసి స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ఆగష్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ జరుగుతాయని, రాష్ట్ర మానవవనరులు అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం , ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్, ఆర్ టి జి శాఖల మంత్రి నారా లోకేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. పెరేడ్ గ్రౌండ్స్ లో గ్రౌండ్ ప్రిపరేషన్, డెకరేషన్, మార్చ్ ఫాస్ట్, బందోబస్తుకు చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి సీట్ ఎరెంజ్మేంట్ అతిధుల ఆహ్వానం కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విద్యా శాఖ, సంక్షేమ శాఖ, టూరిజం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వాంతంత్ర్య దినోత్సవం సందేశానికి జిల్లాలో జరిగిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులు వివరాలు అందించాలన్నారు. వివిధ శాఖలలో గత సంవత్సర కాలంగా అమలు జరిగిన కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంస పత్రాలకు ప్రతిపాదించిన వివరాలను ఆగష్టు 7వ తేది నాటికి అందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సజావుగా కొనసాగేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్ డి ఓ కే. శ్రీనివాస రావు , జిల్లా అధికారులు పాల్గొన్నారు.


జనం కోసమే

నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత
శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని
ముఖులిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా
మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని
ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం..

టి.బాలు
బ్రాంచ్ మేనేజర్,
సెల్: 9440747307

ఎన్.లక్ష్మీనారాయణ
రీజనల్ మేనేజర్
సెల్: 6301107116

విలేఖరులు కావలెను..

| | |
|---|---|
| వినుకొండ | : శావల్యాపురం, నూజెండ్ల |
| నరసరావుపేట | : రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ |
| పెదకూరపాడు | : బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి |
| సత్తెనపల్లి | : నకరికల్లు |
| తెనాలి | : తెనాలి రూరల్, కొల్లిపర |
| ప్రత్తిపాడు | : పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు |
| మంగళగిరి | : తాడేపల్లి, మంగళగిరి |